క్లుప్తంగా

వైఎస్‌ఆర్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు



కండువా వేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని వికృతమాల గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్‌ఆర్ సీపీలో చేరారు. టీడీపీకి చెందిన మిఠాయి కార్తీక్ రాయల్, పలువురు నాయకులను సోమవారం శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుమలయ్య, వైఎస్ ఆర్ సీపీ నాయకులు ఐతేపల్లి గురునాథం, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

కారు డ్రైవర్‌కు గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి అందించిన వివరాలు.. రేణిగుంట నుంచి శ్రీకాళహస్తికి వెళుతున్న లారీ సీతారాంపేట వద్ద ముందు వెళుతున్న కారును ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ శివశంకర్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ త్యాగరాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శివయ్య సేవలో మాచర్ల ఎమ్మెల్యే



కుటుంబ సభ్యులతో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని సోమవారం మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, వైఎస్ ఆర్ సీపీ మండల యువజన అధ్యక్షుడు సురేంద్రకుమార్ యాదవ్ స్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాదం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు ఏఈఓ ధనపాల్, సునీల్, వెంకీ, దినేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

క్వారీ వివాదంపై ఫిర్యాదు

పెళ్లకూరు: మండలంలోని కానూరు రెవెన్యూ పరిధిలో ఉన్న మైనింగ్ క్వారీలో చోటు చేసుకున్న వివాదంపై మంగళవారం మెగా కంపెనీ తరఫున మల్లికార్జున్, సన్నిహిత ఎంటర్ ప్రైజెస్ నుంచి ప్రవీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. లీజు అగ్రిమెంట్ ప్రకారం మైనింగ్ క్వారీలో నిల్వ ఉన్న 1.50 లక్షల మెట్రిక్ టన్నులు కంకర తీసుకెళ్లనివ్వకుండా సన్నిహిత ఎంటర్ ప్రైజెస్ యాజమాన్యం అడ్డుకుంటున్నారని కంపెనీ ప్రతినిధి మల్లికార్జున్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఫోర్జరీ సంతకంతో మైనింగ్ క్వారీలో అక్రమంగా తవ్వకాలు చేపట్టి, రాయల్టీ చెల్లించకుండా దౌర్జన్యంగా కంకరను తీసుకెళుతున్నారంటూ సన్నిహిత ఎంటర్ ప్రైజెస్ ఎండీ సర్వేపల్లి ప్రవీణ ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదులను పోలీసులు పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

కండలేరులో 11.480 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 11.480 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిలో తాళ్వాయిపాడు వద్ద మంగళవారం ముందు వెళుతున్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి తిరుపతికి ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సు మార్గమధ్యంలో తాళ్వాయిపాడు వద్ద ముందు వెళుతున్న లారీని ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ఘటనలో బస్సు అద్దం పగిలిపోవడంతో ముందు సీటులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

నేడు కల్యాణోత్సవం

రాపూరు: హిందూ ధర్మప్రచారంలో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటలకు రాపూరులోని జూనియర్ కళాశాల ఆవరణలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వామి, అమ్మవార్ల రథయాత్ర జరుగుతుందన్నారు. రాత్రి స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. అలాగే పురాణ ప్రవచనాలు, అన్నమాచార్య కీర్తనల ఆలాపన తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



వేరుశనగ చీరలో ముత్యాలమ్మ



కనకదుర్గమ్మకు రాజరాజేశ్వరి అలంకరణ



ప్రత్యేక అలంకరణ చాముండేశ్వరి



రాజరాజేశ్వరిగా పానగల్ గంగమ్మ



విశేషాలంకరణలో చెంగాళమ్మ



మహిషాసురమర్దినిగా అవనాక్షమ్మ



ప్రత్యేక అలంకరణలో కామాక్షాంబిక అమ్మవారు



విశేషాలంకరణలో సాయిబాబా

వైభవంగా ముగిసిన దసరా వేడుకలు



కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి



ఆలయం వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు



హర్షిత సూర్యకుమార్ నాట్య ప్రదర్శన



కనకదుర్గమ్మ కలశాన్ని ఊరేగిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం వివిధ ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని వేరుశనగ చీరతో అలంకరించారు. శ్రీకాళహస్తి ఆలయం తరఫున ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వాయనం ఇచ్చారు. బియ్యపు కృష్ణారెడ్డి మండపంలో ఉత్సవ మూర్తి రాజేశ్వరి, బంగారమ్మ, ఏడు గంగల అమ్మవారిని సిద్ధిధాత్రిగా అలంకరించారు. పానగల్ గంగమ్మ, బీపీ అగ్రహారం పెద్ద, చిన్న గంగమ్మలు రాజరాజేశ్వరిగా, భాస్కర్ పేట చాముండేశ్వరి దేవి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అన్ని ఆలయాల్లో కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు, పసుపు, కుంకుమ, పసుపుదారాలను పంచి పెట్టారు.

చెంగాళమ్మ ఆలయంలో పొంగళ్లు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో మంగళవారం విజయదశమి సందర్భంగా చెంగాళమ్మ ఆలయంలో పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల అభిషేకాల అనంతరం విశేషాలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి, మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏడాది పొంగళ్లు పెట్టేది ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, మాజీ ఎంపీటీసీ చెంబేటి మునిరత్నంరెడ్డి, వైఎస్‌ఆర్ సీపీ నాయకులు గురవారెడ్డి, హరిదాసు రెడ్డి, రంగారెడ్డి, మహేంద్ర పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మకు కలశాభిషేకం

శ్రీకాళహస్తి: కనకాచలం కొండపై వెలసిన దుర్గమ్మకు మంగళవారం వైభవంగా కలశాభిషేకం నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం అనుబంధ దేవాలయమైన కనకాచలం కొండపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ తల్లికి విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని తొమ్మిదోరోజు విశేష కలశాభిషేక పూజలు చేపట్టారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో కలశాన్ని ఆలయ ఆవరణలో ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. చివరన కలశాభిషేకం వేదోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి సేవలో ఆలయ చైర్మన్

కొత్తపేట ఉప్పు వీధిలో వెలసిన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్త మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆయన్ను శ్రీ వాసవి ఆర్యవైశ్య సమాజం సభ్యులు సన్మానించారు.

వైభవంగా దశమి వేడుకలు

నారాయణవనం: మండలవ్యాప్తంగా విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సముదాయంలోని టీటీడీ అనుబంధ ఆలయంలో సోమవారం ఉదయం అవనాక్షమ్మ అమ్మవారికి సర్కారు అభిషేకం నిర్వహించి చందనంతో అలంకరించారు. సాయంత్రం మహిషాసుర మర్దినిగా ఊంజల్‌సేవలో దర్శనమిచ్చారు. అనంతరం ధ్వజావరోహనం నిర్వహించారు. కైలాసనాథకోనలోని కామాక్షాంబిక అమ్మవారు మహిషాసుర మర్దినిగా, నారాయణవనం ధర్మరాజుల ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా, మంగళవారం నర్తన దుర్గగా ఊంజల్‌సేవలో పాల్గొన్నారు. నగరువీధిలోని రామాలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో ధనలక్ష్మిగా అలంకరించారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట సాయిబాబా ఆలయంలో మంగళవారం విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. విజయదశమి రోజున సాయిబాబా జీవ సమాధిలోకి వెళ్లిన సందర్భంగా ప్రత్యేక అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. నగర సంకీర్తన, బాబా కాకడ హారతి, అభిషేకాలు, సంధ్యా హారతి, పల్లకి సేవ, ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీకాళహస్తి: దసరా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం కొత్తపేటలోని శ్రీసీతాలమ్మ దేవాలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ కర్యక్రమంలో హర్షిత సూర్యకుమార్ సీతా స్వయంవరం, శంభో శంభో, పాహిమాం శ్రీరాజరాజేశ్వరి, శ్రీమన్నారాయణ.. పాటలకు చేసిన నాట్యం చూపరులను ఆకట్టుకుంది. అనంతరం ఆలయం తరఫున నాట్య ప్రదర్శనలు ఇచ్చిన వారికి తీర్థప్రసాదాలు అందించారు.

మున్సిపల్ కార్యాలయంలో ఆయుధపూజ

శ్రీకాళహస్తి: పురపాలక సంఘం కార్యాలయంలో విజయదశమి పురస్కరించుకొని వాహనాలు, పరికరాలకు కమిషనర్ ఎం.రమేష్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం ఆయుధ పూజ నిర్వహించారు. పసుపు, చందనం, మామిడి ఆకులు, పూలతో అలంకరించి పూజ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎం.రమేష్‌బాబు మాట్లాడుతూ శ్రీకాళహస్తి పురప్రజలకు మున్సిపల్ సిబ్బందికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కర్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు ఈ.శ్రీనివాసులు ఎం.బాలకృష్ణ, ఆర్‌ఐ రవికాంత్ , పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: దసరా నవరాత్రి ఉత్సవాల్లో బాగంగా మంగళవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పట్టణంలో వెలసిన అమ్మవారి ఆలయాలను సందర్శించారు. బజారువీధి, బహుదూర్ పేటలో వెలసిన కన్యకాపరమేశ్వరి దేవిని, కొత్తపేటలో వెలసిన శ్రీశీతాలమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని కోరుకున్నా న్నారు .అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

సిపాయి శాంతికి ఘన నివాళి



అక్షయ క్షేత్రంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ సిపాయి

రేణిగుంట: ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సతీమణి సిపాయి శాంతి సుబ్రమణ్యం 10వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమెకు ఘన నివాళులర్పించారు. సోమవారం రేణిగుంట మర్రిగుంట సమీపంలోని ఆమె ఘాట్ వద్ద ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, డాక్టర్ కీర్తిసాగర్‌రెడ్డి, డాక్టర్ మానీరెడ్డి, కుటుంబ సభ్యులు కలసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయ మార్గంలోని మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పవన్, వీవీ కృష్ణా, డాక్టర్ బాబు, నాగేశ్వరరావు, సూర్యకుమారి, దేవరాజులు, పెరుమాళ్‌రెడ్డి, రిటైర్డ్ పోలీసు అధికారి శ్రీనివాస్, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరులో కొంతమంది ఆక్రమించుకున్న ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ అధికారులు మంగళవారం ఆక్రమణలు తొలగించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే.. తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయానికి ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 191, 192, 195, 197లో ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించుకుని క్రయ విక్రయాలు చేయడమే కాకుండా పక్కా భవనాలు నిర్మించేందుకు సిద్ధం అవుతుండడంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక వీఆర్వోతో పాటుగా ఆర్‌ఐ రమ్యస్వాతి క్షేత్రస్థాయిలో పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. దీంతో వీఆర్వో జగదీష్ విచారణ ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిలో ఎవరైనా అక్రమంగా ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గోళీ సోడా ప్లాంట్ ప్రారంభం



గోళీసోడా ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

శ్రీకాళహస్తి: సినిమా వీధిలో గురు గోళీసోడా నూతన ప్లాంట్‌ను సోమవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ముందుగా వారికి గురు గోళీసోడా యజమానులు ఎం.శ్రీనివాసులు నాయుడు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి నూతన ప్లాంట్‌ను ప్రారంభించి స్విచ్ ఆన్ చేశారు ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది గల్లా సుదర్శన్ రావు వైఎస్‌ఆర్ సీపీ నాయకులు ముత్యాల పార్థసారథి, మురళి యాదవ్, రెడ్డి శేఖర్, బోర్డు మెంబర్ భాస్కర్, కంట ఉదయ్‌కుమార్, నంద, శ్రీవారి సురేష్, ముని రెడ్డి, కోళ్లూరు హరినాయుడు, లక్కమనేని కృష్ణ, మొద్దుమూడి రవి, మణినాయుడు, మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మహారాజగోపుర కలశ ప్రతిష్ట

నాయుడుపేటటౌన్: మండలంలోని తిమ్మాజికండ్రిగ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున నిర్మించిన అభయానుగ్రహ వేంకటేశ్వరస్వామి ఆలయ మహారాజ గోపుర కలశ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక వేడుకలను బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పీ నరసింగరావు తెలిపారు. తెలంగాణ సీఎం కే చంద్రశేఖర్‌రావు ఆయన సతీమణి శోభమ్మ సహకారంతో నిర్మించిన మహాగోపుర ప్రతిష్ఠ టీటీడీ దేవస్థానం పూర్వాచార్యులు ఉదయగిరి అనంత నారాయణ చార్యులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ సీఎం సమీప కుటుంబ సభ్యులు, బంధువులు, తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

నాయుడుపేటటౌన్: మండలంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పెళ్లకూరు మండలం చెంబడిపాళెం గ్రామానికి చెందిన చిమిర్తిపల్లి నాగరాజు, మనుబోలు పెంచలయ్య అనే వ్యక్తులు ద్విచక్రవాహనంలో గూడూరు నుంచి నాయుడుపేట వైపు బయలుదేరారు. మార్గమధ్యంలో మండలంలోని తుమ్మూరు సమీపంలో స్వర్ణముఖి నది బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న ఆటో వారి వాహనాన్ని ఢీకొంది. గాయపడిన ఇద్దరిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే పుదూరు సమీపంలో రహదారిపై మంగళవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఓ వాహనంలోని చిట్టమూరు మండలం కోతలగుంటకు చెందిన సురేష్‌కు గాయాలయ్యాయి. మరో బైక్‌లో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఈ ప్రమాదాలపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరసింహరావు తెలిపారు.

మేరా మట్టి మేరా దేశ్ కలశ యాత్ర



మట్టి కలశాలతో ర్యాలీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ఏర్పేడు: నెహ్రూ యువ కేంద్రం, యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పేడులో మేరా మట్టి మేరా దేశ్ కలశ యాత్ర ఘనంగా జరిగింది. ఏర్పేడులోని వెంకటగిరి రోడ్డు కూడలి నుంచి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు డప్పు వాయిద్యాలు, కోలాటాలతో ర్యాలీ నిర్వహించారు. ముందుగా వందేమాతరం గీతంతో ప్రారంభించి, కార్యక్రమం ముఖ్య ఉద్దేశంతో పాటు పంచ్‌ప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. మట్టిని కలశాలలో సేకరించి ఢిల్లీకి పంపనున్నారు. కార్యక్రమంలో యువనేస్తం వ్యవస్థాపకుడు మునిశేఖర్, నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర డైరెక్టర్ విజయరావు, ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, హనుమంత్ నాయక్, వినోద్, అరుణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం..ప్రాణదానంతో సమానం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి

గూడూరురూరల్: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి అన్నారు. గూడూరులోని వీఎస్‌ఆర్ పాఠశాలలో ప్రభాస్ యువసేన అధ్యక్షుడు యోగి ఆధ్వర్యంలో జరిగిన సినీ హీరో యంగ్ రెబల్‌స్టార్ ప్రభాస్ జన్మదిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. గూడూరు, పరిసర ప్రాంతాల నుంచి యువకులు అధిక సంఖ్యలో పాల్గొని 150 యూనిట్ల రక్తం దానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అలాగే నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నదానం చేశారు. అనంతరం కోనేటిమిట్ట ప్రాంతానికి చెందిన అన్వేష్ దివ్యాంగుల అంతర్జాతీయ క్రికెట్‌కు భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందుకున్న సందర్భంగా అన్వేష్‌ను అభినందించారు. అలాగే మాళవ్యానగర్‌లో ఉన్న సీనియర్ నాయకులు కోడూరు శ్రీనివాసులురెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కోశాధికారి సూరిశెట్టి హరికృష్ణ, తిరుపతి జిల్లా డీవీఎంసీ సభ్యుడు వీ ప్రభాకర్, రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా అరణియార్ అభివృద్ధి పనులు





పిచ్చాటూరు అరణియార్‌లో చురుగ్గా సాగుతున్న బోటింగ్ జట్టి నిర్మాణ పనులు, అరణియార్‌లో బేస్మెంట్ పూర్తయిన వ్యూ టవర్ నిర్మాణం

- 2024 మార్చిలో పూర్తి చేస్తామంటున్న అధికారులు
- వ్యూటవర్ బేస్మెంట్, బోటింగ్ జట్టి పునాది పనులు పూర్తి

పిచ్చాటూరు: అరణియార్ వద్ద తుడా నిధులు రూ.1.82 కోట్లతో చేపడుతున్న మొదటి విడత టూరిజం పనులు చురుగ్గా సాగుతున్నాయి. మొదటి విడతలో 1.89 ఎకరాల్లో వ్యూ టవర్, బోటింగ్ జట్టి, 4 బోట్లు, చిల్డ్రన్స్ పార్క్, మరుగుదొడ్లు, రిటైనింగ్ వాల్ పనులు చేపడుతున్నారు. ఇందులో వ్యూ టవర్ బేస్మెంట్ లెవల్, బోటింగ్ జట్టి పునాది పనులు పూర్తయ్యాయి. మొత్తం పనులను 2024 మార్చి నాటికి పూర్తి చేస్తామని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. రెండవ దశలో 0.81 ఎకరాల్లో రూ.3 కోట్లతో ఎంట్రన్స్ ప్లాజా, ఫుడ్ కోర్ట్, కాటేజీల నిర్మాణం, వెహికల్ పార్కింగ్ ఏరియా, గార్డెన్, లాండ్ స్కేపింగ్, ఫౌంటైన్ పనులు చేపట్టడానికి ప్రతిపాదించారు. మొదటి పనులు పూర్తయ్యే నాటికి రెండవ విడత పనులు ప్రారంభానికి ఏర్పాట్లు చేయడానికి తుడా సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. పనుల పురోగతిని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.